


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348


# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| శనివారం 02 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 334 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు "టీజీ ఆర్గానిక్స్" యాప్ ప్రారంభం – మే 4న ప్రారంభించనున్న మంత్రి తుమ్మల




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడానికి, రైతులు పండించిన సేంద్రీయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరవేసేలా ప్రత్యేక మొబైల్ యాప్ "టీజీ ఆర్గానిక్స్"ను మే 4న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో ఈ యాప్ పై ఆయన సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్లో సరైన గుర్తింపు, నకిలీ ఉత్పత్తుల నియంత్రణ, రైతులకు లాభదాయక ధరలు, వినియోగదారులకు నమ్మకం కల్పించడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) నిర్దేశించిన జాతీయ సేంద్రీయ ప్రమాణాల ప్రకారం రాష్ట్రంలో ఇప్పటికే వేలాది మంది రైతులు సేంద్రీయ ధృవీకరణ పొందుతున్నారని, వీరందరిని ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ డిజిటల్ ప్లాట్‌ఫాం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు నేరుగా ధృవీకరించబడిన రైతుల నుంచి సేంద్రీయ ఉత్పత్తులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉండటంతో మధ్యవర్తుల పాత్ర తగ్గి పారదర్శక వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంపై పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా రైతులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.



## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు జూన్ 2 నాటికి పరిష్కారం – మంత్రి పొంగులేటి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను జూన్ 2వ తేదీ నాటికి న్యాయపరమైన చిక్కులు లేకుండా పరిష్కరించేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం వివిధ సొసైటీల్లో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులను ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు. అన్ని సొసైటీలు కలసి ఒక జేఏసీగా ఏర్పడి ప్రభుత్వానికి సహకరించాలని సూచించిన మంత్రి, సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చినట్లే, ఇప్పుడు కూడా ప్రజాప్రభుత్వం అదే విధంగా ముందుకెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో పాటు జర్నలిస్టులకు కూడా నివాస స్థలాలు కేటాయించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మిక సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ సంస్థ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఉన్నతాధికారులు, ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు, వివిధ ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో విస్తృత సమావేశం నిర్వహించగా, సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారంపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం మాట్లాడుతూ "నేను వేరు మీరు వేరు అన్న భావన నాకు లేదు, అందరం కలిసి పనిచేస్తేనే ప్రభుత్వం బలపడుతుంది" అని పేర్కొంటూ ఆర్టీసీని ప్రజా సేవా సంస్థగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గాజులరామారంలో 100 ఎకరాల్లో బస్ టెర్మినల్, శంషాబాద్‌లో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి టెర్మినల్ నిర్మాణం, 1000 ఈవీ బస్సుల ప్రవేశం, మెట్రోతో అనుసంధానం వంటి కీలక ప్రాజెక్టులను ప్రకటించారు. అలాగే డీజిల్ ఖర్చు తగ్గించేందుకు ఈవీ బస్సులు అవసరమని, సంస్థ ఆర్థిక స్థిరత్వం కోసం ఖర్చుల నియంత్రణ కీలకమని తెలిపారు. పెండింగ్ బకాయిలు, కారుణ్య నియామకాలు, ఉద్యోగుల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీని బలహీనపరిచే చర్యలు ఎవరూ చేయకూడదని హెచ్చరించిన సీఎం, కార్మికులు–యాజమాన్యం మధ్య సమన్వయం అత్యవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశం ద్వారా ఆర్టీసీ భవిష్యత్ అభివృద్ధికి స్పష్టమైన దిశ లభించిందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ. హనుమంతరావు మరియు నూతన డీజీపీ సీవీ ఆనంద్






సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను ఎంసీహెచ్ ఆర్ డీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (బీసీ సంక్షేమం) వీ. హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీసీ సంక్షేమ కార్యక్రమాల అమలు, పలు అభివృద్ధి పథకాల పురోగతి తదితర అంశాలపై సౌజన్యపూర్వకంగా చర్చ జరిగినట్లు సమాచారం. అలాగే ఇటీవల నియమితులైన రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎంసీహెచ్ ఆర్ డీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర పోలీస్ శాఖలో శాంతి భద్రతల నిర్వహణ, ఆధునిక పోలీసింగ్ విధానాలు, ప్రజా భద్రతకు సంబంధించిన చర్యలపై వివరాలు అందించినట్లు తెలిసింది. ఈ భేటీల సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## దేశవ్యాప్తంగా సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ వ్యవస్థ పరీక్ష ప్రజలు భయపడవద్దు: ఎన్‌డీఎంఏ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సమాచారం చేరవేయడానికి ఉపయోగించే సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ వ్యవస్థ సమర్థతను పరీక్షించేందుకు National Disaster Management Authority ఆధ్వర్యంలో మే 02, 2026న దేశవ్యాప్తంగా ప్రత్యేక టెస్ట్ నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్ష ఢిల్లీ ఎన్‌సీఆర్‌తో పాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాజధాని నగరాల్లో నిర్వహించబడనుండగా, సరిహద్దు ప్రాంతాలు మరియు ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు మినహాయింపు ఇవ్వబడినట్లు వెల్లడించారు. ఈ పరీక్ష సమయంలో పౌరుల మొబైల్ ఫోన్లలో గట్టిగా శబ్దం లేదా వైబ్రేషన్‌తో కూడిన అత్యవసర అలర్ట్ నోటిఫికేషన్ రావచ్చని పేర్కొంటూ, ఇది కేవలం వ్యవస్థ పనితీరును పరీక్షించడానికి పంపబడే టెస్ట్ సందేశం మాత్రమేనని, ఎటువంటి అత్యవసర పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ అలర్ట్ వచ్చినప్పుడు ప్రజలు భయపడకుండా సాధారణంగా ఉండాలని, ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు. విపత్తు లేదా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సమాచారం వేగంగా చేరేలా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఈ టెస్ట్ అలర్ట్ గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ముందుగా తెలియజేసి అపోహలు, గందరగోళం రాకుండా సహకరించాలని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గాంధీ ఆసుపత్రిలో మదర్ మిల్క్ బ్యాంక్, అవయవ మార్పిడి కేంద్రం ప్రారంభం – వైద్యరంగంలో నూతన అధ్యాయం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్‌తో పాటు అవయవ మార్పిడి కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వివిధ విభాగాల పనితీరు, వైద్య సేవల విధానాన్ని వైద్యులు మంత్రికి వివరించారు. ఉస్మానియా ఆసుపత్రిలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి విజయవంతంగా కాలేయ మార్పిడి చేసిన గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్‌ను మంత్రి ప్రత్యేకంగా సన్మానించారు. అలాగే గాంధీ ఆసుపత్రి ఐవీఎఫ్ కేంద్రంలో చికిత్స పొంది అక్కడే కవల పిల్లలకు జన్మనిచ్చిన దంపతులను కలుసుకుని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీ వైద్య కళాశాల 68వ బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తి కేవలం ఉద్యోగం కాదని, జీవితాంతం మానవ సేవకు అంకితమయ్యే పవిత్ర బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ, జీవన ప్రమాణాల మెరుగుదలే వైద్యుల ప్రధాన లక్ష్యమని, నైతికతతో సేవ చేసే వైద్యుడికి సమాజంలో ఎప్పటికీ గౌరవం ఉంటుందని తెలిపారు. 170 సంవత్సరాల చరిత్ర కలిగిన గాంధీ ఆసుపత్రి దేశంలో ప్రముఖ వైద్య కేంద్రంగా ఎదిగిందని, కోవిడ్, డెంగ్యూ వంటి విపత్తుల సమయంలో కీలక సేవలు అందించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలను విస్తరిస్తున్నామని, అవయవ మార్పిడి సేవల కోసం గాంధీ ఆసుపత్రిలో సుమారు నలభై కోట్ల రూపాయలతో అత్యాధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రోజుకు ముప్పై నుంచి నలభై ప్రసవాలు జరిగే ఈ ఆసుపత్రిలో శిశువులకు తల్లి పాలు అందుబాటులో లేకపోతే ఉపయోగపడేలా మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే మత్తు పదార్థాల చికిత్స కోసం ప్రత్యేక విభాగాన్ని కూడా ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు, నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు విస్తరించామని, ఆరోగ్య రంగంలో వేలాది ఉద్యోగాలను భర్తీ చేశామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై సమగ్ర కార్యాచరణతో రావాలి ఆర్టీసీ సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: రాష్ట్రంలో ఆర్టీసీ సంస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులకు సూచించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఉన్నతాధికారులు, ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు కలిసి చర్చించి ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలు అందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని ప్రభుత్వం పరిష్కరిస్తుందని స్పష్టం చేసిన ఆయన, ఆర్టీసీ బకాయిలు గత ప్రభుత్వాల కారణంగా పెరిగినప్పటికీ వాటిని చెల్లించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. గాజులరామారంలో వంద ఎకరాలు, శంషాబాద్ సమీప బహదూర్‌గూడలో నూట యాభై ఎకరాల్లో ఆధునిక బస్ టెర్మినళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్ ఉద్యోగం కూడా తొలగించబోమని స్పష్టం చేసిన సీఎం, ఉద్యోగులు మరియు యాజమాన్యం మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని సూచించారు. డీజిల్ ఖర్చును తగ్గించేందుకు వెయ్యి విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, చిన్న చిన్న వివాదాలు సంస్థకు నష్టం కలగకుండా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమ్మె కాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల సహకారంతోనే ఆర్టీసీ దేశంలో అగ్రగామి సంస్థగా నిలిచిందని పేర్కొన్న ముఖ్యమంత్రి, సంస్థ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కొప్పోల్ శ్రీ ఉమ సంగమేశ్వర స్వామి దర్శనంతో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 02, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం శంకరంపేట్ మండలంలోని కొత్తపేట గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, దళారీలకు అవకాశం లేకుండా నేరుగా ప్రభుత్వమే ధాన్యం సేకరిస్తుందని తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిస్తూ కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, గిన్నెలు, టార్పాలిన్లు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు కొప్పోల్ గ్రామ శివారులోని శ్రీ ఉమ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, DRDA అధికారులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కలెక్టర్ ప్రావీణ్యకు ఘన వీడ్కోలు – నూతన కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు స్వాగతం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహించడం ఎంతో గొప్ప అనుభూతిగా నిలిచిందని, జిల్లాతో ఏర్పడిన అనుబంధం ఎన్నటికీ మర్చిపోలేనిదని బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. రహదారులు, భవనాల ప్రత్యేక కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన సందర్భంగా గురువారం రాత్రి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆమెకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించగా, ఇదే వేదికపై నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌కు స్వాగతం పలికారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రావీణ్య సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కింది స్థాయి ఉద్యోగి నుంచి ప్రతి శాఖాధికారి వరకు అందరూ సంపూర్ణ సహకారం అందించారని, జిల్లా అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అందరి భాగస్వామ్యం కీలకమైందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. నూతన కలెక్టర్ ప్రతీక్ జైన్ నాయకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రావీణ్య తనదైన ముద్ర వేసిన అధికారిగా కొనియాడి, జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్య సాధనకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కృష్ణానదిలో పంచలోహ శ్రీరామ విగ్రహం లభ్యం



సందేశం టైమ్స్, చందర్లపాడు, మే 02, ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల వద్ద కృష్ణానదిలో పంచలోహంతో తయారైన శ్రీరాముడి విగ్రహం లభ్యమవడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. చారిత్రక ప్రాశస్త్యం గల గుడిమెట్ల కొండల్లో వజ్రాలు దొరికిన సందర్భాలు ఉన్నట్లు స్థానికులు చెబుతుండగా, తవ్వకాల సమయంలో అరుదుగా పురాతన విగ్రహాలు బయటపడిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో సుమారు 20 ఏళ్ల క్రితం రామన్నపేట కొండల్లో తవ్వకాలు జరిపినప్పుడు పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం లభ్యమై, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సమక్షంలో ప్రభుత్వానికి అప్పగించిన విషయం గుర్తుచేసుకుంటున్నారు. ఇదే నేపథ్యంలో గుడిమెట్ల సమీపంలోని నదిలో స్నానానికి దిగిన సమయంలో గ్రామాల్లో తిరుగుతూ చీపుర్లు అమ్ముకునే వ్యక్తులకు ఈ శ్రీరామ విగ్రహం కనిపించడంతో వారు స్థానికులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

# మే డే వేడుకలు ఘనంగా – కార్మికులు పథకాలను వినియోగించుకోవాలి: కలెక్టర్





సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 02, ప్రతినిధి: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్. మానస తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల కృషిని కొనియాడుతూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, కార్మికులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, పరిశ్రమల యాజమాన్యాలకు, విద్యార్థులకు కలెక్టర్ షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి జానీ పాషా, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, కార్మిక నాయకులు, పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి ఈ ప్రకటన విడుదల చేశారు.

# అమరావతి ఖర్చులపై కేబినెట్ నిర్ణయాలు చర్చనీయాంశం

సందేశం టైమ్స్, అమరావతి, మే 02, ప్రతినిధి: రాష్ట్ర కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అమరావతి రాజధానిలో నిర్మాణంలో ఉన్న అసెంబ్లీ భవనానికి సంబంధించిన అద్దాల ఏర్పాటుకు రూ.2,540 కోట్లు, స్పైర్, పార్కింగ్ రింగ్, అప్రోచ్ బ్రిడ్జిల నిర్మాణానికి మరో రూ.798 కోట్లు వ్యయం చేయడానికి పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ లంప్సమ్ కాంట్రాక్టు టెండర్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్లు మంత్రి పయ్యావుల మీడియాకు వెల్లడించారు. ఇదే సమయంలో ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల పూర్తి కోసం సంవత్సరానికి కేవలం రూ.1000 కోట్లు కేటాయింపులే ఉండటంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అమరావతి భవనాల నగిషీలు, అలంకరణలపై వేల కోట్ల రూపాయల వ్యయం చేయడంపై కూడా చర్చ కొనసాగుతోంది. మరోవైపు ఆరు జిల్లాల్లో టీడీపీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను 33 ఏళ్ల లీజుకు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. రాజధానిలో ఇళ్ల స్థలాల అంశంలో మార్పులు చేస్తూ రెవెన్యూ శాఖ నుంచి సీఆర్‌డీఏకి భూములను తిరిగి అప్పగించేందుకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పెట్రోల్, డీజిల్ కొరత సమస్యపై మంత్రులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ సమస్య రాష్ట్రం వల్ల కాకపోయిందని ప్రజలకు వివరించాలని, ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పరిస్థితులున్నాయని ప్రచారం చేయాలని సూచించినట్లు సమాచారం. ఆయిల్ కంపెనీలకు రాసిన లేఖలు, కేంద్ర ఆదేశాలు బయటకు రావడంపై కూడా ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించిన క్రెడిట్ మొత్తం రాష్ట్రానికే దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.



# ఆర్టీసీ బస్సులో లంచం డిమాండ్... చెకింగ్ అధికారిపై దాడి

సందేశం టైమ్స్, రాయికోడ్, మే 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ సమీపంలో హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును టికెట్ తనిఖీ కోసం స్క్వాడ్ అధికారులు ఆపగా, ఒక ప్రయాణికుడి వద్ద టికెట్ లేకపోవడంతో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు స్క్వాడ్ అధికారి ప్రయాణికుడు మరియు కండక్టర్ వద్ద నుంచి రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలిసి ఆగ్రహానికి గురైన కండక్టర్‌తో పాటు కొంతమంది ప్రయాణికులు కలిసి సదరు చెకింగ్ అధికారిపై దాడికి దిగినట్లు, చెప్పుతో కొట్టినట్లు తోపులాట జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల అభివృద్ధికి ఈఓఐ గడువు పొడిగింపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 02, ప్రతినిధి: తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (టీజీఆర్ఇడ్కో) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పీఎం ఈ-డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం ఆసక్తి గల భూస్వాములు, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థల నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఈఓఐ) సమర్పణ గడువును మే 07, 2026 వరకు పొడిగించారు. ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, పటాన్‌చెరువు, సంగారెడ్డి, కరీంనగర్, నల్గొండ నగరాల్లోని అనుకూల భూభాగాల కోసం ఈఓఐలను ఆహ్వానిస్తున్నారు. కనీసం 200 చదరపు గజాల విస్తీర్ణం, జాతీయ రహదారులు లేదా ప్రధాన రాష్ట్ర రహదారుల పక్కన ఉండటం, అధిక వాహన రాకపోకలు ఉన్న ప్రదేశాల్లో ఉండటం, మార్కెట్ సముదాయాలు లేదా వాణిజ్య కేంద్రాలకు సమీపంలో ఉండటం, 24 గంటల ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదేశం ఉండటం వంటి ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఎంపికైన ప్రదేశాల్లో పార్కింగ్, ఛార్జింగ్ సదుపాయాలకు తగిన స్థలం, ప్రధాన రహదారికి నేరుగా చేరుకునే మార్గం, విద్యుత్ కనెక్షన్ సమీపంలో ఉండటం వంటి సౌకర్యాలు ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా శుభ్రమైన శక్తి వినియోగానికి తోడ్పాటు అందించడంతో పాటు పీఎం ఈ-డ్రైవ్ మార్గదర్శకాల ప్రకారం అప్‌స్ట్రీమ్ ఎలక్ట్రికల్ మౌలిక వసతులపై 80 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. దరఖాస్తుదారులు తమ గుర్తింపు ఆధారాలు, భూ యాజమాన్య పత్రాలు, ప్రదేశ ఫోటోలు, లేఅవుట్ వివరాలు, సమ్మతి పత్రం, విద్యుత్ కనెక్షన్ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. సమర్పణ పోర్టల్ ద్వారా చేసిన దరఖాస్తుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుందని, సబ్సిడీ మంజూరు పీఎం ఈ-డ్రైవ్ నిబంధనల ప్రకారం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. వివరాలకు అధికారిక వెబ్‌సైట్ లేదా ఇమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో మేడే వేడుకలు - కార్మికులకు 'శ్రమశక్తి ఉత్తమ అవార్డులు' ప్రదానం



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 02, ప్రతినిధి: జహీరాబాద్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు వారి కార్యాలయాల్లోనే 'శ్రమశక్తి ఉత్తమ అవార్డులు'ను జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అస్మా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల శ్రమ తెలంగాణ సంపద సృష్టికి మూలమని, తమ కష్టంతో సమాజ నిర్మాణం, దేశ పురోగతికి బాటలు వేస్తున్న శ్రామికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. శ్రమకు సరైన గుర్తింపు దక్కాలని, కార్మికులు తమ హక్కులపై చైతన్యంతో ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరమేష్ రెడ్డి, శీలవంత్, దిలీప్, అభిషేక్, అజారుద్దీన్, చంద్రశేఖర్ శర్మ, షాహెద్ అలీ, సంగమేష్, స్వామి, చంద్రకళ, జగదీశ్వరి, శ్యామల, అర్చన, యోగేంద్ర శర్మ, ప్రశాంత్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.




## సంగారెడ్డి జిల్లాలో షీ టీమ్ అవగాహన కార్యక్రమాలు మహిళల భద్రత, సైబర్ నేరాలపై చైతన్యం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్ ద్వారా మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు యుబి కంపెనీ మల్లేపల్లి, పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట, అందోల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామాలలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ పూలభాయ్ మాట్లాడుతూ మహిళలపై లింగ వివక్షత, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అత్యవసర పరిస్థితుల్లో 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సంగారెడ్డి షీ టీమ్ నంబర్ 8712656772 ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు, కార్మిక సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాడిఫైడ్ సైలెన్సర్లపై కఠిన చర్యలు - పటాన్‌చెరులో ప్రత్యేక డ్రైవ్, 7 వాహనాలపై జరిమానాలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా పటాన్‌చెరు పట్టణంలో మాడిఫైడ్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టింది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అశోక్, ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి, అధిక శబ్దంతో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్న 7 వాహనాలను గుర్తించి మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అలాగే వాహనాలకు అమర్చిన మాడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి సీజ్ చేశారు. వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా శబ్ద కాలుష్యం సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని, ఇటువంటి వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అశోక్ హెచ్చరించారు.

## బోరంచలో నిరుపేద కుటుంబానికి జీఎంఆర్ ఫౌండేషన్ సాయం - నిత్యవసర సరుకుల పంపిణీ



సందేశం టైమ్స్, మనూర్, మే 02, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మనూర్ మండలంలో నిరుపేద కుటుంబాలకు సేవలందిస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరంచ గ్రామానికి చెందిన సాలె నాగమ్మకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుణ్ణిపు మచ్చేందర్ ఆదేశాల మేరకు ఈ సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరంచ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సిందోల్ సంగారెడ్డి, మొట్లాకుంట నర్సన్న, పాలడుగు రామన్న, చాకలి సత్తయ్యా, చాకలి మైపాల్, గొల్లపాపని గోపాల్, పుట్టి శివన్న, పుట్టి విట్టల్, బుక్క షాఫీ, చెట్టుకింది నర్సిములు, బలప్ప, రామప్ప, బుమప్ప తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం




సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలు-2026ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై అదనపు కలెక్టర్ నగేష్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి సాహితి, జడ్పీ సీఈఓ ఎల్లయ్యలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల కష్టాలను గుర్తిస్తూ వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మికుల సంక్షేమమే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్మిక సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు సబ్సిడీలు, బీమా సదుపాయాలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మిక హక్కుల పరిరక్షణలో సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అన్ని సంఘాలు కలిసికట్టుగా పనిచేస్తే సమస్యలకు సమగ్ర పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి కార్మికుడికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికుల సంక్షేమం, కర్మాగారాల్లో ఎదురయ్యే సమస్యలు, కార్మిక సంఘాల పాత్రపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించగా, కార్యక్రమాల నివేదిక పోస్టర్లను ఆవిష్కరించారు. కార్మిక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రశంసించగా, ఈ కార్యక్రమంలో సంబంధిత పరిశ్రమల యాజమాన్యం, ఐటీసీ ఫ్యాక్టరీ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 140వ మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై సమాన పనికి సమాన వేతనంకై ఉద్యమిద్దాం






సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: మేడే సందర్భంగా మెదక్ పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో 140వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం కేవల్ కిషన్ భవన్ సమీపంలో మున్సిపల్ కార్యాలయం, ఎంసీహెచ్ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, భవన నిర్మాణ కార్మికుల అడ్డా, పీఏసీఎస్ గోదాం వద్ద జెండా ఆవిష్కరణలు చేపట్టి అనంతరం పోస్టాఫీసు వద్ద మేడే సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కోడ్స్ అమలుతో కార్మికులకు సంఘటిత హక్కులు, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా చికాగో నగరంలో 8 గంటల పని దినానికై జరిగిన కార్మికుల పోరాటాన్ని స్మరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జే.సంతోష్, వికలాంగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గ, నాయకులు షౌకత్, మున్సిపల్ యూనియన్ కార్మికులు రాజశేఖర్, ఏసు, మల్లేశం, శోభ, ఎల్లవ్వ, ఉషవ్వ, పోచమ్మ, శేఖర్, అంజి, హమాలీ కార్మికులు బాల్, నర్సు, మల్లేశం, గట్టయ్య, బాలు, ఆంజనేయులు, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## యువత సాధికారతకు కెరీర్ గైడెన్స్ దోహదం కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సాధికారతకు కెరీర్ గైడెన్స్ ఎంతో దోహదపడుతుందని, 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత చదువుల కోసం సరైన స్ట్రీమ్ ఎంపిక చాలా ముఖ్యమని పేర్కొన్నారు. యువత తమ ఆసక్తులు, నైపుణ్యాలు, వ్యక్తిత్వానికి అనుగుణంగా సరైన వృత్తి మార్గాన్ని ఎంచుకోవాలని, నాణ్యమైన విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఓటమి ఒక దశ మాత్రమేనని, దాన్ని గెలుపుకు నాందిగా భావించి మరింత కృషితో ముందుకు సాగాలని సూచించారు. సరైన కోర్సుల ఎంపిక, లక్ష్య నిర్ధేశం, ఉద్యోగ అవకాశాల గుర్తింపులో కెరీర్ గైడెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. జిల్లా సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమం యువత భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణతో పాటు యువతీ యువకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## శిశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో దత్తత సహాయక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తదితరులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువులను పెంచలేని వారు చెత్తకుప్పల్లో లేదా ఇతర ప్రదేశాల్లో వదిలేయకుండా ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా చట్టబద్ధంగా దత్తత ఇవ్వవచ్చని తెలిపారు. దత్తతపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఈ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, ప్రతి సోమవారం ప్రజావాణి రోజున హెల్ప్‌డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియ, అవసరమైన పత్రాలు, ప్రభుత్వ మార్గదర్శకాలపై పూర్తి సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు చట్టబద్ధ దత్తతలు జరిగాయని, అలాగే ఈ ఏడాది 11 అక్రమ దత్తతలను అడ్డుకుని ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాత్సల్య పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేసుకుని చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని సూచిస్తూ, అక్రమ దత్తతలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్ భరోసా పథకం కింద 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దత్తతపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు దత్తతలో చట్ట నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం





సందేశం టైమ్స్, నర్సాపూర్, మే 02, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ 1వ వార్డులో పదో తరగతి (ఎస్ఎస్సీ) పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను వార్డు కౌన్సిలర్ మినికే నర్సమ్మ అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ కృషి కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మినికే రవికుమార్, అంజత్, షాబుద్దీన్, ఆజం, అస్లాం మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు నియామకం – కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యస్. రాజు




సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: మెదక్ జిల్లా ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారిగా యస్. రాజు బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు నిర్వహించనున్న ప్రత్యేక విద్యా వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కరుణాకర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, విద్యాశాఖ పర్యవేక్షకులు లక్ష్మీకాంత్, సమగ్ర శిక్ష అధికారులు నవీన్ రాజులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్



సందేశం టైమ్స్, టేక్మల్, మే 02, ప్రతినిధి: మెదక్ జిల్లా టేక్మల్ మండల పరిధిలోని తంప్లూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు పులబోయిన స్వప్న శ్రీనివాస్ గృహప్రవేశ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై టేక్మల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తిమ్మగారి సుధాకర్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న ప్రభుత్వం పట్ల అభినందనలు తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్లు మంజూరు కావడం వల్ల తమ కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు మజహర్, కాంగ్రెస్ నాయకులు కొట్టి నారాయణ, సర్వాణి చిన్న మల్లేశం, ఖలీల్, ఎల్లయ్య, బండారి కృష్ణ, దుబ్బగల్ల కృష్ణ, మౌలానా జబ్బార్, యువనాయకులు సర్వాణి లక్ష్మణ్, రమేష్, సయ్యద్ వసీం, పప్పుల సాయిబాబా, మండల హౌసింగ్ అధికారి కౌశిక్, పంచాయతీ కార్యదర్శి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర స్థాయి సమీక్ష







సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారం, నీట్ పరీక్షలు, జనగణన, రెడ్ క్రాస్ సభ్యత్వం తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆయా శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాలపై వివరాలు అందించారు.

## నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా చెరుకు సాయికుమార్ నియామకం



సందేశం టైమ్స్, నర్సాపూర్, మే 02, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్-వన్ అధికారి చెరుకు సాయికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్‌లను పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ చెరుకు సాయికుమార్ మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడిచేలా పటిష్ట కార్యాచరణతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తామని తెలిపారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టరేట్ జిల్లా అధికారులు, నర్సాపూర్ మున్సిపాలిటీ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ పార్వతి మరకత రాజరాజేశ్వర స్వామి దివ్య ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 02, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో శ్రీ పార్వతి మరకత రాజరాజేశ్వర స్వామి దివ్య ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి, గ్రామ ప్రజల సంక్షేమం కోసం స్వామివారి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, మాజీ గ్రామ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ పవన్, దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, మే 02, ప్రతినిధి: జిల్లాలో నిర్వహించనున్న నీట్ పరీక్షను ఎలాంటి చిన్న తప్పిదం కూడా లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. మే 3న నిర్వహించనున్న పరీక్షకు జిల్లాలో మొత్తం 479 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గతేడాది మాదిరిగానే పరీక్షలను సజావుగా నిర్వహించాలని, అభ్యర్థులు హాల్ టికెట్‌లోని సూచనలను పూర్తిగా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని, తహసిల్దార్ స్థాయి అధికారులు, ఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది బందోబస్తు ఉండాలని తెలిపారు. కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత కల్పించాలని ఆదేశించారు. విద్యుత్, సీసీ కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అన్ని సౌకర్యాలు ఉండాలని, అభ్యర్థుల రవాణా కోసం ఆర్టీసీ బస్సులు సకాలంలో నడపాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ప్రాథమిక వైద్యం, అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని, ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించి మధ్యాహ్నం 1:30 లోపు చేరుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, గడియారాలు, బ్యాగులు, కాలిక్యులేటర్లు అనుమతించబడవని, ఫోటో ఐడీ, అడ్మిట్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. లోహ ఆభరణాలు ధరించకూడదని, తక్కువ మడమల చెప్పులు మాత్రమే ధరించాలని తెలిపారు. పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## మే డే వేడుకలు ఘనంగా – నీట్‌కు ఏర్పాట్లు పూర్తి, ధాన్యం అక్రమాలపై కఠిన చర్యలు




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 02, ప్రతినిధి: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్ మీటింగ్ హాల్లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్మికుల కృషిని కొనియాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, పరిశ్రమల యజమానులు, విద్యార్థులకు షీల్డులు అందజేశారు. ఇదే సందర్భంగా జిల్లాలో మే 2న నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి ఐదు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పటిష్ట పోలీసు బందోబస్తు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయగా అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచే హాజరై మధ్యాహ్నం 1:30లోపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇదే సమయంలో ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ తిరుమలగిరి మార్కెట్‌లో జరిగిన అక్రమాలపై ఒకరిని సస్పెండ్ చేసి ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు, సంబంధిత ఐకేపీ కేంద్రాల ఏజెన్సీలను రద్దు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో అన్ని కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## సంగారెడ్డిలో నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి – మే డే వేడుకలు, బాలల భద్రత కార్యక్రమాలు, ధాన్యం కొనుగోలు, ప్రజాపాలన ప్రగతి సమీక్ష



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 02, ప్రతినిధి: జిల్లాలో మే 3న నిర్వహించనున్న నీట్ (యూజీ)–2026 పరీక్షకు 8 కేంద్రాల్లో 2,772 మంది అభ్యర్థుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అభ్యర్థులు ఉదయం నుంచే కేంద్రాలకు చేరుకోవాలని, మధ్యాహ్నం 1:30 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశం ఉండదని స్పష్టం చేస్తూ అడ్మిట్ కార్డు, గుర్తింపు కార్డు, ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు 144 సెక్షన్ అమలు, పటిష్ట బందోబస్తు, వైద్య సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించగా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని టీజీఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు "బాలల భద్రత–డ్రగ్స్ రహిత తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా 0–5 సంవత్సరాల పిల్లల ఆరోగ్య స్క్రీనింగ్ ప్రారంభించగా రిస్క్ ఉన్న 24 మంది పిల్లలను గుర్తించి వైద్య సేవలకు రిఫర్ చేశారు. అలాగే ఆటిజం నివారణపై రీస్ ప్లేస్ సంస్థ కలెక్టర్‌కు మెమోరాండం అందజేసి పర్యావరణ కాలుష్యం నియంత్రణపై దృష్టి సారించాలని కోరింది. ధాన్యం కొనుగోలు అంశంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి జిల్లాలో 175 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించగా, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనంగా ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ వారోత్సవాలు, నీట్ పరీక్ష, ప్రజావాణి, ఉపాధి హామీ కార్యక్రమాలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.